RNI NO.TELTEL/2022/83842

# ప్రభాత గమనం
PRABHATA GAMANAM
తెలుగు దినపత్రిక

వరంగల్ | సంచిక 278 | సంపుటి 4 | గురువారం | 09-07-2026 | పేజీలు 4 | వెల 3/-

ప్రభాత గమనం
తెలుగు దినపత్రిక
జర్నలిస్టుగా....ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వాల దృష్టికి తీసుకొచ్చి వాటి పరిష్కారానికి కృషి చేయాలనుకుంటున్నారా ?
విలువలతో కూడిన జర్నలిస్టుగా... ఆత్మగౌరవంతో పాత్రికేయుడుగా సాగాలనుకుంటున్నారా...
ప్రభాత గమనం తెలుగు దినపత్రిక మీకు ఆహ్వానం పలుకుతుంది. ఆసక్తి కలిగిన అనుభవజ్ఞులైన విలేకరులు వెంటనే సంప్రదించండి.
ఫోన్ : 7780470374

## కేసముద్రం అధికార పార్టీలో
# అసమ్మతి జ్వాలలు





కేసముద్రం మండల అధికార పార్టీలో అంతర్గత విభేదాలు రోజురోజుకూ ముదురుతూ రాజకీయంగా కీలక మలుపు తిరుగుతున్నాయి. నిన్నటివరకు రెండు వర్గాలకే పరిమితమైన అసమ్మతి ఇప్పుడు మూడో వర్గం ఆవిర్భావంతో పార్టీని మూడు ముక్కలుగా చీల్చే పరిస్థితికి చేరుకుందని పార్టీ వర్గాల్లోనే జోరుగా చర్చ సాగుతోంది. స్థానిక ఎమ్మెల్యే తీసుకుంటున్న ఏకపక్ష నిర్ణయాలు, ప్రజల్లో బలం ఉన్న నాయకులను పక్కనబెట్టి కొందరికే ప్రాధాన్యం ఇవ్వడం, కీలక నిర్ణయాల్లో సీనియర్ నాయకత్వాన్ని సంప్రదించకపోవడం వంటి అంశాలపై సొంత పార్టీ నేతలే తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నట్లు సమాచారం. ఇదే సమయంలో కేసముద్రం వ్యవసాయ మార్కెట్ చైర్మన్ వ్యవహారశైలిపై కూడా వ్యతిరేక స్వరం బలపడడంతో ఇప్పటికే ఉన్న విభేదాలు మరింత ముదిరినట్లు తెలుస్తోంది. పరిస్థితి చేయి దాటుతుందనే ఆందోళనతో అసమ్మతి నేతలను బుజ్జగించేందుకు స్థానిక ఎమ్మెల్యే ఒక మధ్యవర్తి ద్వారా సయోధ్య ప్రయత్నాలు చేసినట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. అయితే ఆ ప్రయత్నం ఫలించకపోగా, మధ్యవర్తి సమక్షంలోనే ఎమ్మెల్యే వ్యవహారశైలిపై అసమ్మతి నేతలు తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేసినట్లు సమాచారం. గ్రామస్థాయి నుంచి మండల స్థాయి వరకు పార్టీని బలోపేతం చేసిన నాయకులను పక్కనబెట్టి వ్యక్తిగత ప్రాధాన్యాలకు పెద్దపీట వేయడం వల్ల కార్యకర్తల్లో తీవ్ర నిరాశ నెలకొన్నదని వారు స్పష్టం చేసినట్లు తెలిసింది. ఇప్పటికే రెండు వర్గాలుగా ఉన్న నాయకత్వం మధ్య కొనసాగుతున్న విభేదాలకు తాజా పరిణామాలు మరింత ఆజ్యం పోసినట్లు రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. మార్కెట్ చైర్మన్ వ్యవహారశైలి, ఎమ్మెల్యే నిర్ణయాలపై పెరుగుతున్న వ్యతిరేకత, అసమ్మతి నేతల బహిరంగ విమర్శలు కలిసి కేసముద్రం అధికార పార్టీలో కొత్త రాజకీయ సమీకరణాలకు దారితీసే సూచనలు కనిపిస్తున్నాయి. పరిస్థితి ఇలాగే కొనసాగితే రానున్న రోజుల్లో పార్టీపై తీవ్ర ప్రభావం పడే అవకాశముందని, అధిష్ఠానం వెంటనే జోక్యం చేసుకుని అసమ్మతిని చల్లార్చాల్సిన అవసరం ఉందని పార్టీ శ్రేణుల్లోనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

— హైదరాబాద్, ప్రభాత గమనం

- ఎమ్మెల్యే ఏకపక్ష నిర్ణయాలపై స్థానిక నేతల తిరుగుబాటు..
- రెండు గ్రూపులు కాస్తా మూడు ముక్కలయ్యే పరిస్థితి
- సయోధ్య కోసం వచ్చిన మధ్యవర్తి ముందే బహిరంగ విమర్శలు
- మధ్యవర్తి ముందే ఎమ్మెల్యే తీరుపై తీవ్ర అభ్యంతరాలు..
- మార్కెట్ చైర్మన్ తీరుపై సొంత పార్టీలోనే తీవ్ర వ్యతిరేకత
- గ్రామస్థాయి నాయకత్వంలో పెరుగుతున్న అసంతృప్తి..
- అధిష్ఠానం జోక్యం చేసుకోకపోతే పార్టీకి భారీ రాజకీయ నష్టం తప్పదన్న ఆందోళన

2



## న్యాయం జరుగుతుందనే నమ్మకాన్ని ప్రజల్లో కలిగించాలి
### వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్.శ్వేత

ప్రభాత గమనం, వరంగల్ క్రైమ్ బ్యూరో :

పోలీస్ స్టేషన్ వచ్చే ప్రజలకు న్యాయం జరుగుతుందనే నమ్మకాన్ని భరోసాని కలిగించాలని వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్.శ్వేత,ఐ.పి.ఎస్ పోలీస్ అధికారులు, సిబ్బందికి సూచించారు. బుధవారం వెస్టు జోన్ పరిధిలోని స్టేషన్ ఘన్‌పూర్ పోలీస్ స్టేషన్‌ను వరంగల్ పోలీస్ కమిషనర్ బుధవారం సందర్శించారు. ఈ ఉదయం పోలీస్ స్టేషన్‌కు చేరుకున్న పోలీస్ కమిషనర్‌కు వెస్ట్ జోన్ డీసీపీ రాజమహేంద్ర నాయక్ పూల మొక్కను అందజేశారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ.. ప్రజల కోసం పనిచేస్తున్నామని, పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదుదారునితో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని, స్వీకరించిన ప్రతి ఫిర్యాదుకు ఫిర్యాదుదారునికి రశీదు అందజేయాలని, పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులను పోలీస్ స్టేషన్ ఎక్కువ సేపు వేసి వుండే పరిస్థితి రాకుండా స్టేషన్ అధికారులు, సిబ్బంది చూడాలని. ముఖ్యంగా రాత్రి సమయాల్లో వచ్చే ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలని పోలీస్ కమిషనర్ తెలియజేసారు. పోలీస్ కమిషనర్ వెంట్ వెస్ట్ జోన్ డీసీపీ రాజమహేంద్ర నాయక్, ఏసీపీ భీంశర్మ, ఇన్స్ స్పెక్టర్ వేణు, ఎస్.ఐ మనిషా పాల్గొన్నారు

## సుపారీ పేరుతో ప్రముఖ వైద్యుడికి బెదిరింపులు

- డబ్బుల కోసం కుట్ర పన్నిన ముగ్గురు నిందితుల అరెస్ట్
- మాజీ డ్రైవర్ తో పాటు మరో ఇద్దరిని అదుపులోకి తీసుకున్న హన్మకొండ పోలీసులు

3

## తుంగతుర్తిలో
# హైటెన్షన్!

- తుంగతుర్తి కాంగ్రెస్‌లో వర్గపోరు రోడ్డెక్కింది
- ఇరు వర్గాల మధ్య రాళ్లు, కర్రలతో ఘర్షణ.. పోలీసుల వాహనాల ధ్వంసం
- చలో గాంధీభవన్ కార్యక్రమాన్ని అడ్డుకోవడంతో ఉద్రిక్తత
- పదవుల పంపకాలపై పాత, కొత్త నేతల మధ్య తీవ్ర అసంతృప్తి
- రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్‌లో వర్గ విభేదాలపై కొత్త చర్చ

సూర్యాపేట జిల్లా తుంగతుర్తి కాంగ్రెస్ పార్టీలో వర్గ విభేదాలు తారస్థాయికి చేరాయి. ఎమ్మెల్యే మందుల సామేల్, ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, మాజీ మంత్రి దామోదరరెడ్డి వర్గాల మధ్య నెలకొన్న ఆధిపత్య పోరు బుధవారం బహిరంగ ఘర్షణకు దారితీసింది. అర్వపల్లిలో ఇరు వర్గాలు రాళ్లు, కర్రలతో పరస్పరం దాడులు చేసుకోగా, పరిస్థితిని అదుపు చేసేందుకు రంగంలోకి దిగిన పోలీసుల వాహనాలు కూడా ధ్వంసమయ్యాయి. పార్టీ పదవుల పంపకాలపై చెలరేగిన అసంతృప్తి రాష్ట్ర కాంగ్రెస్ లో కొత్త రాజకీయ సంక్షోభానికి తెరలేపింది.

— వివరాలు 3వ పేజీలో



## గ్రామాభివృద్ధికి సమన్వయంతో
# పని చేయాలి

గ్రామాల అభివృద్ధి కోసం ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేస్తేనే ఆశించిన ఫలితాలు సాధ్యమవుతాయని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క పేర్కొన్నారు. గ్రామ పంచాయతీలను స్వయం సమృద్ధిగా తీర్చిదిద్దే లక్ష్యంతో ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపడుతోందని, కేంద్ర–రాష్ట్ర ప్రభుత్వ పథకాలను సమర్థవంతంగా అమలు చేయడంతో పాటు తాగునీరు, పారిశుద్ధ్యం, రహదారులు, విద్యుత్, ఉపాధి హామీ పనులు వంటి మౌలిక సదుపాయాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆమె సూచించారు. మహబూబాబాద్ లో నిర్వహించిన గ్రామ పంచాయతీ సమగ్ర అభివృద్ధి ప్రణాళిక (జీపీడీపీ) శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు గ్రామాభివృద్ధికి కార్యాచరణ ప్రణాళికతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.

- జీపీడీపీ శిక్షణ కార్యక్రమంలో మంత్రి సీతక్క
- సర్పంచులు, కార్యదర్శులకు సమగ్ర అభివృద్ధి ప్రణాళికపై శిక్షణ
- అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని ఆదేశం
- తాగునీరు, పారిశుద్ధ్యం, రహదారులు, మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టి

3

## గవర్నర్ పర్యటనకు సర్వం సిద్ధం



రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్ల గురువారం హనుమకొండ, వరంగల్ జిల్లాల్లో నిర్వహించనున్న అధికారిక పర్యటనను విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత, హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి, వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్యశారద అధికారులను ఆదేశించారు. గవర్నర్ పర్యటన సందర్భంగా భద్రత నుంచి ప్రోటోకాల్ వరకు ప్రతి అంశాన్ని పకడ్బందీగా అమలు చేయాలని సూచించారు.

- గవర్నర్ శివ ప్రతాప్ శుక్ల పర్యటనపై జిల్లా యంత్రాంగం సమీక్ష
- భద్రత, ట్రాఫిక్, పారిశుధ్యం, వైద్య సేవలపై అధికారులకు దిశానిర్దేశం
- 'నషా ముక్త్ భారత్' ర్యాలీతో పాటు అభివృద్ధి కార్యక్రమాలపై గవర్నర్ సమీక్ష

3

# తెలంగాణ భూరక్షణ సమితి జిల్లా అధ్యక్షుడిగా పందుల సారయ్య

- నియామకపత్రాన్ని అందజేసిన ఉమ్మడి జిల్లాల అధ్యక్షుడు నత్తి కోర్నేల్

మహబూబాబాద్, జూలై 8 (ప్రభాత గమనం) :




తెలంగాణ భూ రక్షణ సమితి మహబూబాబాద్ జిల్లా అధ్యక్షుడిగా కేసముద్రం మండల కేంద్రానికి చెందిన ప్రముఖ సామాజిక కార్యకర్త పందుల సారయ్య నియమితులయ్యారు. ఈ మేరకు తెలంగాణ భూ రక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షులు బుగ్గ మైసన్న ఆదేశాల మేరకు.. ఉమ్మడి వరంగల్ జిల్లాల అధ్యక్షుడు, 'దళిత రత్న' నత్తి కోర్నేల్ బుధవారం సారయ్యకు నియామక పత్రాన్ని అందజేశారు.ఈ సందర్భంగా ఉమ్మడి వరంగల్ జిల్లాల అధ్యక్షుడు నత్తి కోర్నేల్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీల ప్రకారం అర్హులైన పేదలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ భూములకు, లావాణి పట్టా, ఇనాం భూములకు యాజమాన్యపు హక్కులు కల్పిస్తామని ఇచ్చిన వాగ్దానాన్ని ప్రభుత్వం నిలబెట్టుకోవాలన్నారు. దళితులు, గిరిజనులు, వెనుకబడిన తరగతులు (బీసీ), బహుజనులకు భూములపై పూర్తి హక్కులు కల్పించేలా ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి చొరవ చూపాలని కోరారు. వరంగల్ రైతు డిక్లరేషన్, వికారాబాద్ దళిత డిక్లరేషన్‌లలో పేర్కొన్న అంశాలను తక్షణమే అమలు చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.తనపై నమ్మకంతో జిల్లా అధ్యక్ష బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర, ఉమ్మడి జిల్లాల నాయకత్వానికి నూతన అధ్యక్షుడు పందుల సారయ్య కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. "నాపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా, అణగారిన వర్గాల ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానన్నారు. లావాణి పట్టా భూములకు, ప్రభుత్వ భూములకు పేదలకు యాజమాన్య హక్కులు దక్కేలా నా శాయశక్తులా కృషి చేస్తాను" అని స్పష్టం చేశారు. తన నియామకానికి సహకరించిన రాష్ట్ర కోఆర్డినేటర్ 'దళిత రత్న' దెబ్బ రమేష్, రాష్ట్ర ఉపాధ్యక్షులు సిద్దులుతో పాటు ఉమ్మడి జిల్లా పెద్దలకు ధన్యవాదాలు తెలిపారు.



# మలిదశ ఉద్యమకారుడు వీరస్వామి మృతి

- నివాళులర్పించిన సీపీఎం నాయకులు
- నిరుపేద కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగం ఇవ్వాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి


గార్ల, జూలై 8 ( ప్రభాత గమనం) :

తెలంగాణ రాష్ట్ర సాధన మలిదశ ఉద్యమకారుడు, గార్లకు చెందిన పిల్లలమర్రి వీరస్వామి బుధవారం తెల్లవారుజామున గుండెపోటుతో అకాల మరణం చెందారు. ఆయన మృతి పట్ల సీపీఎం పార్టీ తీవ్ర సంతాపం వ్యక్తం చేసింది. వీరస్వామి మరణవార్త తెలుసుకున్న సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కందునూరి శ్రీనివాస్ నేతృత్వంలోని బృందం గండి గ్రామంలోని ఆయన నివాసానికి చేరుకుని, వీరస్వామి భౌతికకాయంపై పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించింది. అనంతరం శోకతప్త హృదయాలతో ఉన్న కుటుంబ సభ్యులను పరామర్శించి, వారిని ఓదార్చారు.ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కందునూరి శ్రీనివాస్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం మలిదశ ఉద్యమంలో వీరస్వామి క్రియాశీలక పాత్ర పోషించారని కొనియాడారు. ఉద్యమకారుడైనప్పటికీ, ఆయన గార్ల రైల్వే సైకిల్ స్టాండ్ నడుపుకుంటూ అత్యంత సాధారణ జీవితాన్ని గడుపుతూ జీవనం సాగించారని గుర్తుచేశారు. కుటుంబానికి పెద్ద దిక్కైన వీరస్వామి అకాల మరణంతో ఆ కుటుంబం రోడ్డున పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. బాధితులకు తక్షణమే 'ఇందిరమ్మ ఇల్లు' మంజూరు చేయాలని, అలాగే వీరస్వామి భార్యకు అవుట్‌సోర్సింగ్ ఉద్యోగం ఇచ్చి ఆదుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి అలవాల సత్యవతి, నాయకులు వి.వెంకటేశ్వర్లు, ఐ.గోవింద్, సిహెచ్.మౌనిక, వి.కొండయ్య, ఎస్.నాగరాజు, జీవంచిపల్లి గిరి తదితరులు ఉన్నారు.

## కేసముద్రం అధికార పార్టీలో

# అసమ్మతి జ్వాలలు

- ఎమ్మెల్యే ఏకపక్ష నిర్ణయాలపై స్థానిక నేతల తిరుగుబాటు..
- రెండు గ్రూపులు కాస్తా మూడు ముక్కలయ్యే పరిస్థితి
- సయోధ్య కోసం వచ్చిన మధ్యవర్తి ముందే బహిరంగ విమర్శలు
- మధ్యవర్తి ముందే ఎమ్మెల్యే తీరుపై తీవ్ర అభ్యంతరాలు..
- మార్కెట్ చైర్మన్ తీరుపై సొంత పార్టీలోనే తీవ్ర వ్యతిరేకత
- గ్రామస్థాయి నాయకత్వంలో పెరుగుతున్న అసంతృప్తి..
- అధిష్టానం జోక్యం చేసుకోకపోతే పార్టీకి భారీ నష్టం తప్పదు




హైదరాబాద్, ప్రభాత గమనం :

కేసముద్రం మండల అధికార పార్టీలో నెలకొన్న అంతర్గత విభేదాలు ఇప్పుడు బహిరంగ రాజకీయ సంక్షోభంగా మారుతున్న సంకేతాలు కనిపిస్తున్నాయి. నిన్నటివరకు రెండు వర్గాలుగా పరిమితమైన గ్రూపు రాజకీయాలు ప్రస్తుతం మూడు ముక్కలయ్యే దిశగా పయనిస్తున్నాయనే చర్చ పార్టీ వర్గాల్లోనే కాకుండా నియోజకవర్గ రాజకీయాల్లోనూ తీవ్ర చర్చకు దారితీసింది. ఎమ్మెల్యే తీసుకుంటున్న ఏకపక్ష నిర్ణయాలు, స్థానిక నాయకత్వానికి తగిన ప్రాధాన్యం ఇవ్వకపోవడం, క్షేత్రస్థాయిలో ప్రజల్లో బలం ఉన్న నాయకులను పక్కనబెట్టి కొందరు వ్యక్తులకే ప్రాధాన్యత కల్పించడం వంటి అంశాలపై సొంత పార్టీ నేతలే తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నట్లు సమాచారం. గ్రామ స్థాయి నుంచి పార్టీ కోసం ఎన్నో సంవత్సరాలుగా పనిచేసిన నాయకులను పూర్తిగా విస్మరించి, ప్రజల్లో అంతగా గుర్తింపు లేని వ్యక్తులను ప్రోత్సహించడం వల్ల కార్యకర్తల్లో తీవ్ర నిరాశ నెలకొన్నట్లు తెలుస్తోంది. ఎన్నికల సమయంలో పార్టీ విజయానికి శ్రమించిన నాయకులు, కార్యకర్తలకు కనీస గుర్తింపు కూడా లేకపోవడం వల్ల అసంతృప్తి మరింత పెరిగిందని పార్టీ అంతర్గత వర్గాలు పేర్కొంటున్నాయి.

### ఎమ్మెల్యే తీరుపై పెరుగుతున్న అసంతృప్తి

స్థానిక సమస్యలు, పార్టీ వ్యవహారాలపై నాయకులతో సంప్రదింపులు లేకుండానే నిర్ణయాలు తీసుకుంటున్నారనే ఆరోపణలు ఎమ్మెల్యేపై వినిపిస్తున్నాయి. ముఖ్యమైన నియామకాలు, పార్టీ కార్యక్రమాలు, స్థానిక రాజకీయ నిర్ణయాల విషయంలో సీనియర్ నాయకులను పూర్తిగా పక్కనబెడుతున్నారని అసమ్మతి నేతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నట్లు సమాచారం. దీంతో ద్వితీయ శ్రేణి నాయకత్వంలోనూ తీవ్ర అసంతృప్తి నెలకొంది.

### మార్కెట్ చైర్మన్ వైఖరిపై సొంత పార్టీలోనే విమర్శలు

గతంలో రెండు వర్గాలుగా విడిపోయిన నేతలంతా.. ఇకనైనా విభేదాలు పక్కనబెట్టి అందరం కలిసికట్టుగా ముందుకు సాగాలని భావిస్తున్న తరుణంలో కేసముద్రం వ్యవసాయ మార్కెట్ చైర్మన్ వ్యవహారశైలి కూడా వివాదాలకు కేంద్రబిందువుగా మారినట్లు తెలుస్తోంది. స్థానిక సీనియర్ నాయకులతో సమన్వయం లేకుండా, స్వతంత్రంగా నిర్ణయాలు తీసుకుంటూ ఒంటెద్దు పోకడతో వ్యవహరిస్తున్నారనే విమర్శలు సొంత పార్టీలోనే వ్యక్తమవుతున్నాయి. ఈ వ్యవహారశైలే ఇప్పటికే ఉన్న విభేదాలను మరింత తీవ్రతరం చేసిందని పార్టీ వర్గాలు చర్చించుకుంటున్నాయి.

### రాయబారం విఫలం.. మధ్యవర్తి ముందే ఆగ్రహావేశం

పార్టీలో నెలకొన్న అసంతృప్తిని చల్లార్చేందుకు స్థానిక ఎమ్మెల్యే ఒక కీలక నాయకుడిని మధ్యవర్తిగా పంపి అసమ్మతి నేతలతో చర్చలు జరిపించినట్లు విశ్వసనీయ సమాచారం. అయితే ఆ ప్రయత్నం పూర్తిగా విఫలమైనట్లు తెలుస్తోంది. మధ్యవర్తి సమక్షంలోనే ఎమ్మెల్యే వ్యవహారశైలిపై అసమ్మతి నేతలు తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేసినట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. నియోజకవర్గంలో జరుగుతున్న పరిణామాలను బహిరంగంగానే ఎండగట్టడంతో సయోధ్య ప్రయత్నాలకే ఎదురుదెబ్బ తగిలినట్లు సమాచారం.

### రెండు గ్రూపుల నుంచి మూడు వర్గాల దిశగా..

గతంలో రెండు వర్గాలుగా ఉన్న నాయకులు విభేదాలను పక్కనబెట్టి కలిసి పనిచేయాలనే సంకేతాలు కనిపించినప్పటికీ, తాజా పరిణామాలు కొత్త రాజకీయ సమీకరణాలకు దారితీసినట్లు తెలుస్తోంది. ఇప్పటికే ఉన్న రెండు వర్గాలకు అదనంగా మరో వర్గం బలపడుతుండటంతో పార్టీ మూడు గ్రూపులుగా విడిపోయే ప్రమాదం ఉందని సీనియర్ నాయకులే ఆందోళన వ్యక్తం చేస్తున్నట్లు సమాచారం.

### క్షేత్రస్థాయి కార్యకర్తల్లో అయోమయం

నాయకుల మధ్య సమన్వయం లేకపోవడం, ఒకరిపై ఒకరు బహిరంగ విమర్శలు చేసుకోవడం వల్ల కార్యకర్తలు తీవ్ర అయోమయంలో ఉన్నట్లు తెలుస్తోంది. గ్రామస్థాయిలో పార్టీ కార్యక్రమాలు కూడా ప్రభావితమవుతున్నాయని, దీనివల్ల ప్రత్యర్థి పార్టీలకు రాజకీయంగా లాభం చేకూరే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు. కేసముద్రం మండలంలో రోజురోజుకూ ముదురుతున్న గ్రూపు రాజకీయాలపై పార్టీ రాష్ట్ర నాయకత్వం దృష్టి సారిస్తుందా? అసమ్మతి నేతలను పిలిచి చర్చించి వివాదానికి తెరదిస్తుందా? లేక ఈ విభేదాలు మరింత ముదిరి రానున్న స్థానిక రాజకీయాలపై ప్రభావం చూపుతాయా? అన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. ప్రస్తుతం కేసముద్రం అధికార పార్టీలో నెలకొన్న పరిణామాలు నియోజకవర్గ రాజకీయాల్లో హాట్‌టాపిక్‌గా మారాయి.

# ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

- రంగాపురం యూపీఎస్ ప్రధానోపాధ్యాయులు గోపాల శ్రీధర్
- విద్యార్థులకు రూ.4 వేల విలువైన నోట్ బుక్స్ అందజేసిన ఉపాధ్యాయుడు

కేసముద్రం, జూలై 8(ప్రభాత గమనం):

ప్రభుత్వ పాఠశాలల్లోనే విద్యార్థులకు నాణ్యమైన విద్య లభిస్తుందని ఎంపీ యుపీఎస్ రంగాపురం పాఠశాల ప్రధానోపాధ్యాయులు గోపాల శ్రీధర్ అన్నారు. బుధవారం కేసముద్రం మండలం రంగాపురం ప్రాథమికోన్నత పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయుడు టి. కృష్ణమూర్తి విద్యార్థులకు రూ.4 వేల విలువైన నోట్ బుక్స్ అందజేశారు.ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు గోపాల శ్రీధర్ మాట్లాడుతూ..ప్రభుత్వ పాఠశాలలోనే విద్యార్థులకు నాణ్యమైన విద్య లభిస్తుందని, విద్యార్థి ప్రభుత్వ పాఠశాలలోని అన్ని వనరులను సద్విని యోగం చేసుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు.ఈ సందర్భంగా దాత, పాఠశాల ఉపాధ్యాయుడు కృష్ణమూర్తిని హెచ్‌ఎం గోపాల శ్రీధర్ ప్రత్యేకంగా అభినందించారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రవి,రమేష్, సంతోష్ ,కృష్ణమూర్తి ,షాహిదా బేగం, సరిత, అంగన్ వాడీ టీచర్ జయమ్మ పాల్గొన్నారు.



# డోర్నకల్ పీఎస్ లో ఎస్పీ తనిఖీ

- పెండింగ్ కేసులపై సీరియస్!
- బాధ్యతారాహిత్యాన్ని ఉపేక్షించేది లేదంటూ ఆగ్రహం
- ప్రజలతో మర్యాదగా నడుచుకోవాలి.. విధుల్లో పారదర్శకత ముఖ్యం
- గ్రామస్థాయిలో సైబర్ అవగాహన పెంచాలని ఆదేశం

డోర్నకల్, జూలై 08 (ప్రభాత గమనం) :

మహబూబాబాద్ జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ (ఎస్పీ) డాక్టర్ శబరీష్, ఐపీఎస్ బుధవారం డోర్నకల్ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్ నిర్వహణ, రికార్డులు, పెండింగ్ కేసుల పురోగతితో పాటు ప్రజలకు అందుతున్న సేవలపై ఆయన క్షుణ్ణంగా సమీక్ష నిర్వహించారు. బాధ్యతారాహిత్యంగా వ్యవహరించినా, కేసుల దర్యాప్తులో జాప్యం చేసినా సహించేది లేదని ఈ సందర్భంగా సిబ్బందిని ఎస్పీ గట్టిగా హెచ్చరించారు.స్టేషన్‌లో పెండింగ్‌లో ఉన్న కేసుల వివరాలను పరిశీలించిన ఎస్పీ, దర్యాప్తు ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. "కేసుల దర్యాప్తులో నాణ్యత చాలా ముఖ్యం. బాధితులకు సత్వర న్యాయం జరిగేలా ప్రతి కేసును అత్యంత బాధ్యతాయుతంగా విచారించాలి" అని ఆయన స్పష్టం చేశారు. స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులను మర్యాదపూర్వకంగా ఆహ్వానించాలని, వారి సమస్యలను ఓర్పుతో విని చట్టపరమైన పరిష్కారం చూపాలని సిబ్బందికి సూచించారు. ప్రజల విశ్వాసాన్ని చూరగొనేలా 24 గంటల సేవా దృక్పథంతో పనిచేయాలని పిలుపునిచ్చారు.నేరం జరిగిన తర్వాత స్పందించడం కంటే, నేరాలను ముందే అరికట్టే 'ప్రోయాక్టివ్ పోలీసింగ్' విధానానికి ప్రాధాన్యత ఇవ్వాలని ఎస్పీ ఆదేశించారు. గ్రామాలు, తండాలు, సమస్యాత్మక ప్రాంతాలపై నిరంతర నిఘా ఉంచాలన్నారు. అలాగే, క్రైమ్ అండ్ క్రిమినల్ ట్రాకింగ్ నెట్‌వర్క్ అండ్ సిస్టమ్స్ సాఫ్ట్ వేర్‌లో ప్రతి ఎఫ్ఐఆర్, దర్యాప్తు పురోగతి, డైలీ డైరీ వివరాలను 100 శాతం ఎప్పటికప్పుడు ఆన్‌లైన్ చేయాలని, ఎలాంటి పెండింగ్ ఉంచరాదని తేల్చి చెప్పారు.ప్రస్తుతం సమాజాన్ని పట్టిపీడిస్తున్న సైబర్ నేరాల పట్ల గ్రామస్థాయిలో విస్తృత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని డాక్టర్ శబరీష్ పేర్కొన్నారు.పాఠశాలలు, కళాశాలలు, యువజన సంఘాల వేదికగా ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు.డిజిటల్ అరెస్ట్ మోసాలు, లోన్ యాప్ వేధింపులు, OTP మోసాలు, పెట్టుబడి ఆశలు, సోషల్ మీడియా మోసాల బారిన పడకుండా ప్రజలను అలర్ట్ చేయాలని ఆదేశించారు.మహిళల రక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, రాత్రి సమయాల్లో బ్లూ కోల్ట్స్, మొబైల్ పెట్రోలింగ్, బీట్ వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని ఎస్పీ ఆదేశించారు. అసాంఘిక కార్యకలాపాలు, మాదకద్రవ్యాలు, అక్రమ మద్యం రవాణా, దొంగతనాలపై ఉక్కుపాదం మోపాలని, రౌడీషీటర్లు, హిస్టరీషీటర్ల కదలికలపై నిరంతర నిఘా ఉంచాలన్నారు. విలేజ్ పోలీస్ అధికారులు (VPOలు) క్షేత్రస్థాయిలో ప్రజలతో సత్సంబంధాలు పెంపొందించుకొని, స్థానిక సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని కోరారు. ప్రజల సహకారంతోనే సమర్థవంతమైన పోలీసింగ్ సాధ్యమవుతుందని ఎస్పీ డాక్టర్ శబరీష్ ఈ సందర్భంగా పునరుద్ఘాటించారు.




## ఆగస్టు 5లోగా

# మిల్లరు బకాయిలు చెల్లించాలి

- సివిల్ సప్లయ్ టాస్క్ ఫోర్స్ అదనపు ఎస్పీ ప్రభాకర్ రావు

మహబూబాబాద్, జూలై08(ప్రభాత గమనం):



యాక్షన్ ప్యాడీ, సీఎంఆర్ బకాయి ఉన్న రైస్ మిల్లర్లు ఆగస్టు 5వ తేదీలోగా బకాయిలను ప్రభుత్వ ఖజానాకు జమచేయాలని సివిల్ సప్లయి టాస్క్ ఫోర్సు అదనపు ఎస్పీ ప్రభాకర్ రావు ఆదేశించారు. బుధవారం మహబూబాబాద్ కలెక్టరేట్ లోని ప్రధాన సమావేశ మందిరంలో రెవెన్యు అదనపు కలెక్టర్ కె.అనిల్ కుమార్ నేతృత్వంలో యాక్షన్ ప్యాడీ (రబీ2022-23), సీఎంఆర్ బకాయిలు, డిఫాల్ట్ రైస్ మిల్లర్లతో సమావేశం నిర్వహించారు. నిర్ణీత గడువులోగా బకాయిలు చెల్లించని డిఫాల్ట్ రైస్ మిలర్లపై రెవెన్యూ రికవరీ చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు వారి ఆస్తులను స్వాధీనం చేసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా పౌర సరఫరాలు అధికారి జే రమేష్, జిల్లా సివిల్ సప్లైస్ కార్పొరేషన్ మేనేజర్ వి.నరసింహరావు, సివిల్ సప్లయి టాస్క్ ఫోర్సు అధికారులు లక్ష్మా రెడ్డి, సివిల్ సప్లయి టాస్క్ ఫోర్సు సిఐ వసంత్ కుమార్ , ఇతర టాస్క్ ఫోర్సు సిబ్బంది మహబూబాబాద్ జిల్లా రైస్ మిల్లర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు ఓలం కృష్ణమూర్తి, ప్రధాన కార్యదర్శి నాళ్ళ వెంకటేశ్వర్లు, కోశాధికారి చిల్లంచెర్ల సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాలాభివృద్ధికి సమన్వయంతో పని చేయాలి

- సర్పంచులు, అధికారులు ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగాలి: మంత్రి సీతక్క
- మహబూబాబాద్ లో గ్రామ పంచాయతీ సమగ్ర అభివృద్ధి శిక్షణ కార్యక్రమం

**మహబూబాబాద్, ప్రభాత గమనం, జూలై 8:**

గ్రామాల సమగ్ర అభివృద్ధికి సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క పిలుపునిచ్చారు. గ్రామ పంచాయతీ సమగ్ర అభివృద్ధి ప్రణాళికపై జిల్లాలోని సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎంపీ పోరిక బలరాం నాయక్, ప్రభుత్వ విప్ డాక్టర్ జాటోత్ రామచంద్రునాయక్, ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు, ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళినాయక్, పంచాయతీరాజ్ కమిషనర్ దివ్య దేవరాజన్ తదితరులు పాల్గొన్నారు. మంత్రి సీతక్క మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా జూలై 8, 9, 10 తేదీల్లో మండల, డివిజన్ స్థాయిలో శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. గ్రామాల అభివృద్ధి కోసం ఐదు శాఖల సమన్వయంతో కమిటీలను ఏర్పాటు చేసి, కేంద్ర– రాష్ట్ర ప్రభుత్వ పథకాల అమలును వేగవంతం చేస్తున్నామని చెప్పారు. గ్రామాలు అభివృద్ధి చెందితేనే జిల్లా, రాష్ట్రం, దేశం అభివృద్ధి చెందుతుందని పేర్కొన్న ఆమె, తాగునీరు, పారిశుద్ధ్యం, సీసీ రోడ్లు, విద్యుత్, పాఠశాలలు, ఉపాధి హామీ పనులు, అంతర్గత రహదారులు వంటి అభివృద్ధి కార్యక్రమాలపై డ్యాష్‌బోర్డు నిర్వహించి పనుల పురోగతిని నిరంతరం పర్యవేక్షించాలని అధికారులకు సూచించారు. ఇటీవల 15వ ఆర్థిక సంఘం నిధులు గ్రామపంచాయతీలకు విడుదలయ్యాయని, వాటిని సమర్థవంతంగా వినియోగించి అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని మంత్రి ఆదేశించారు. వీధి కుక్కల సమస్య పరిష్కారం, అంగన్‌వాడీ భవనాలు, వివో భవనాలు, చెరువులు, ఇంటి కుంటలు తదితర మౌలిక సదుపాయాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. పంచాయతీరాజ్ కమిషనర్ దివ్య దేవరాజన్ మాట్లాడుతూ గ్రామాభివృద్ధిలో సర్పంచులు కీలక పాత్ర పోషించాలని, ప్రభుత్వ పథకాలను ప్రజలకు సమర్థవంతంగా చేరవేయాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లాలోని 482 మంది సర్పంచులు, 405 మంది పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.





# అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణకు ఏఎంసీ చైర్మన్ ఘంటా సంజీవరెడ్డికి ఆహ్వానం

**కేసముద్రం, జూలై 08:( ప్రభాత గమనం):**

మండల పరిధిలోని కాట్రపల్లి గ్రా మంలో ఈ నెల 13న ఘనంగా ని ర్వహించ తలపెట్టిన భారతరత్న డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణ మహోత్సవానికి ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరుకావాల్సిందిగా కేసముద్రం వ్యవసాయ మార్కెట్ కమి టీ చైర్మన్ శ్రీ ఘంటా సంజీవరెడ్డిని ని ర్వాహకులు బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు.ఈ సందర్భంగా చైర్మన్ సంజీవరెడ్డి మాట్లాడుతూ.. సమాజ మార్పునకు దిక్సూచిగా నిలిచిన మహనీయుడు బాబా సాహెబ్ అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమానికి రావడం తన బాధ్యతని, ఈ మహోత్సవానికి తాను తప్పకుండా హాజరవుతానని నిర్వాహకులకు హామీ ఇచ్చారు.మార్కెట్ కమిటీ చైర్మన్‌ను కలిసిన వారిలో ఆర్‌టీఏ మెంబర్ రావుల మురళి, డీసీసీ ఉపాధ్యక్షులు అంబాటి మహేందర్ రెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్ రాంబాబు, మాజీ జెడ్పీటీసీ సురేందర్, గోపా డివిజన్ అధ్యక్షులు సమ్మి గౌడ్, ప్రముఖ నాయకులు ఫిలిప్పు, వెంకన్న, కొమురయ్య తదితర కాంగ్రెస్ శ్రేణులతో పాటు అంబేద్కర్ యువజన సంఘం ప్రతినిధులు జల్లే యాకాంబ్రం, మునిగే చినబాబు తదితరులు పాల్గొన్నారు.




# బీజేపీని ఎండగట్టడంలో కాంగ్రెస్ విఫలం..!

- సర్ పేరుతో ఓట్ల తొలగింపు కుట్రలు
- ప్రజలు అప్రమత్తంగా ఉండాలి
- సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు ఎస్. వీరయ్య

**మహబూబాబాద్, జులై 8(ప్రభాత గమనం):**

దేశవ్యాప్తంగా అమలు చేస్తున్న ప్రత్యేక ఓటరు నమోదు (ఎస్ఐఆర్) ప్రక్రియ పేరుతో లక్షలాది మంది ఓటర్లను జాబితా నుంచి తొలగించే కుట్ర జరుగుతోందని, దీనిని బట్టబయలు చేసి అడ్డుకోవడంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని సిపిఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు ఎస్. వీరయ్య తీవ్రంగా విమర్శించారు. బుధవారం మహబూబాబాద్ పట్టణంలోని పెరమండ్ల జగన్నాథ భవనంలో నిర్వహించిన సిపిఐ(ఎం) జిల్లా స్థాయి రాజకీయ శిక్షణ తరగతులకు హాజరైన అనంతరం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ సమావేశంలో సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు టి. సాగర్, జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్, మున్సిపల్ వైస్ చైర్మన్ సోమయ్య తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వీరయ్య మాట్లాడుతూ దేశవ్యాప్తంగా బీజేపీ ప్రభుత్వం అమలు చేస్తున్న కార్పొరేట్ అనుకూల, ప్రజావ్యతిరేక ఆర్థిక విధానాలపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత పెరుగుతోందన్నారు. ధరల పెరుగుదల, నిరుద్యోగం, రైతు వ్యతిరేక విధానాలు, కార్మిక హక్కులపై దాడులు, ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ వంటి చర్యల కారణంగా ప్రజలు బీజేపీకి దూరమవుతున్నారని పేర్కొన్నారు. ఈ పెరుగుతున్న ప్రజా వ్యతిరేకతను ఎదుర్కోలేక ఎన్నికల్లో గెలవడానికి ప్రజాస్వామ్యాన్ని బలహీనపరిచే కుట్రలకు పాల్పడుతోందని ఆరోపించారు. రైతు, వ్యవసాయ కూలీల సమస్యలను వెంటనే పరిష్కరించాలని, లేకుంటే సిపిఐ(ఎం) ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలు ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు.ఈ సమావేశంలో సిపిఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు గుణగంటి రాజన్న, అలవాల వీరయ్య, కందునూరి శ్రీనివాస్, ఆకుల రాజు, కుంట ఉపేందర్, జిల్లా నాయకులు సమ్మెట రాజమౌళి, పట్టణ కార్యదర్శి బానోతు సీతారాం నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# తుంగతుర్తిలో హైటెన్షన్

- కొట్టుకున్న కాంగ్రెస్ కార్యకర్తలు
- పోలీసుల వాహనాలు ధ్వంసం

**సూర్యాపేట, జులై 8(ప్రభాత గమనం):**

సూర్యాపేట జిల్లా తుంగతుర్తి కాంగ్రెస్ పార్టీలో విభేదాలు తీవ్రరూపం దాల్చాయి. ఎమ్మెల్యే మందుల సామేల్, ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, మాజీ మంత్రి దామోదరరెడ్డి వర్గాల మధ్య విభేదాలు ఇప్పుడు దాడుల వరకు చేరింది. తాజాగా అర్వపల్లిలో రోడ్డుపైనే ఇరు వర్గాలు ఘర్షణకు దిగాయి. రాళ్లు, కర్రలతో దాడులు చేసుకున్నారు. రంగంలోకి దిగిన పోలీసులు కాంగ్రెస్ కార్యకర్తలను చెదరగొట్టారు. అయితే ఈ ఘర్షనలో పోలీసుల వాహనాలు సైతం ధ్వంసం అయ్యాయి. చలో గాంధీ భవన్ అడ్డుకోవడంతో.. ఎమ్మెల్యే మందుల సామేల్ తీరుకు నిరసనగా కొంతమంది కాంగ్రెస్ కార్యకర్తలు ఇవాళ చలో గాంధీభవన్ కు పిలుపునిచ్చారు. వారంతా గాంధీభవన్కే బయలుదేరుతుండగా ఎమ్మెల్యే వర్గం వారిని అడ్డుకుంది. దీంతో అక్కడ ఘర్షణ ఏర్పడినట్లు సమాచారం.అయితే గత ప్రభుత్వంలో ఎన్ని ఇబ్బందులు వచ్చినా వాటిని ఓర్చుకుని పార్టీని గెలిపిస్తే తీరా అధికారంలోకి వచ్చాక పదవులన్నీ వలస నేతలకు ఇస్తున్నారని తుంగతుర్తి కాంగ్రెస్లోప పాత నేతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నో ఏళ్లుగా పార్టీని కాపాడుతున్న క్యాడర్నుయ కాదని ఎమ్మెల్యే మందుల సామేల్ తన వెంట తెచ్చుకున్న నేతలకు పదవులు కట్టబెడుతున్నారని తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.ఇటీవల పార్టీ ప్రకటించిన మండల అధ్యక్షుల నియామకాల విషయంలో తీవ్ర అసంతృప్తి జ్వాలలు ఎగిసిపడుతున్నాయి. పదుల పంపకాల్లో మందుల సామెల్ ఏకపక్షంగా వ్యవహరిస్తున్నాడంటూ




క్యాడర్ రోడెక్కడం దుమారం రేపుతుంది.టీ కాంగ్రెస్ కు బిగ్ చాలెంజ్ కాంగ్రెస్ లో పాత వర్సెస్ కొత్త నేతల వివాదం కేవలం తుంగతుర్తి కే పరిమితం కాలేదు. రాష్ట్ర వ్యాప్తంగా మెజారిటీ నియోజకవర్గాల్లో ఈ వివాదం నివురుగప్పిన నిప్పులా ఉండి రాష్ట్రంలో పార్టీ అధికారంలోకి వచ్చాక అనేక మంది ఇతర పార్టీ నేతలు వలస వచ్చారు. పార్టీ ప్రభుత్వ అవసరాల దృష్ట్యా వారిని ఓల్డ్ క్యాడర్ భరిస్తూ వచ్చిన తమపై కొత్త నేత రాజమహేష్ పెరుగుతుందని అసంతృప్తి వ్యక్తం అవుతుంది. పదవుల పంపకాల్లోనూ తమకు అన్యాయం జరుగుతుందని ఈ విషయంలో ఇక సహించేది లేదని హెచ్చరికలు వినిపిస్తున్నాయి. ఈ క్రమంలో తుంగతుర్తిలో మొదలైన ఈ ఘర్షణను పార్టీ పెద్దలు సామరస్య పూర్వకంగా పరిష్కరించుకుంటే ఇదే తరహా విభేదాలు మిగతా చోట్ల ఏర్పడే అవకాశం ఉందని చర్చ రాష్ట్ర రాజకీయాల్లో వినిపిస్తుంది. మరో రెండేళ్లలో ఎన్నికలు రాబోతున్నాయి.ఈ తరహా విభేదాలు పెరిగిపోతే అది అంతిమంగా ప్రత్యర్థుల చేతికి ఆయుధంగా మారే అవకాశం ఉందనే ఉందనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి.




# ఇల్లందలో 'సర్' ను పరిశీలించిన కలెక్టర్

**ప్రభాత గమనం, వరంగల్ క్రైమ్ బ్యూరో :**

భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు చేపట్టిన ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని పారదర్శకంగా, ఎన్నికల సంఘం నిబంధనలకు అనుగుణంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అధికారులను ఆదేశించారు. బుధవారం వర్ధన్నపేట మండలం ఇల్లంద గ్రామంలో నిర్వహిస్తున్న ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి బూత్ లెవల్ అధికారులు (బీఎల్‌వోలు) నిర్వహిస్తున్న ఓటరు వివరాల నమోదు, ధ్రువీకరణ, ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ ప్రక్రియను క్షుణ్ణంగా పరిశీలించారు. పలువురు ఓటర్లతో మాట్లాడి వారికి ఫారాలు అందాయా, వివరాల నమోదులో ఎలాంటి ఇబ్బందులు ఉన్నాయా అనే విషయాలను అడిగి తెలుసుకున్నారు. బీఎల్‌వోలకు పలు సూచనలు చేస్తూ, ఓటర్లకు ఎన్యుమరేషన్ ఫారాలు నింపడంలో అవసరమైన సహాయం అందించాలని, ప్రతి అర్హుడైన ఓటరికి ఫారం అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇంట్లో లేని ఓటర్ల వివరాలను నమోదు చేసి, వారికి మళ్లీ వెళ్లి ఫారాలు అందించాలని సూచించారు. ఓటరు జాబితా సవరణ ప్రక్రియను పూర్తిగా పారదర్శకంగా, నిష్పాక్షికంగా ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు నిర్వహించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రజలు కూడా ఈ కార్యక్రమానికి సహకరించి అవసరమైన పత్రాలను సమర్పించి ఓటరు జాబితాలో తమ వివరాలను సరిచూసుకోవాలని కోరారు. ఏవైనా సందేహాలు ఉంటే సంబంధిత బీఎల్‌వో, బీఎల్‌వో సూపర్వైజర్ లేదా ఎన్నికల అధికారులను సంప్రదించాలని సూచించారు. ఈ తనిఖీలో వర్ధన్నపేట తహసీల్దార్ విజయసాగర్, సంబంధిత ఎన్నికల అధికారులు, బీఎల్‌వోలు, బీఎల్‌వో సూపర్వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

# మద్యం మత్తులో కారుతో బీభత్సం

- ఇద్దరి మృతికి కారణమైన నిందితుడు అరెస్ట్

**జనగామ, ప్రభాత గమనం:**

పాలకుర్తి పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం రాత్రి జరిగిన రెండు వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతికి కారణమైన నిందితుడు చీపురి రాహుల్ (22), బొమ్మెర గ్రామానికి చెందిన యువకుడిని పాలకుర్తి పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. జూలై 7 సాయంత్రం గుడివాడ చౌరస్తా వద్ద నిందితుడు ఇన్నోవా కారు ను మద్యం మత్తులో అతివేగంగా, నిర్లక్ష్యంగా నడుపుతూ స్ప్లెండర్ ద్విచక్ర వాహనాన్ని వెనుక నుంచి ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో పెంతల వెంకటలక్ష్మి అక్కడికక్కడే మృతి చెందగా, ఆమె భర్తకు స్వల్ప గాయాలయ్యాయి. ప్రమాదం అనంతరం అక్కడి నుంచి ఆగకుండా పరారైన నిందితుడు, కొద్ది సేపటికే గూడూరు గ్రామంలో మరో ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టడంతో వడ్లకొండ రంజిత్ అక్కడికక్కడే మృతి చెందాడు. రెండో ప్రమాదం తర్వాత కూడా పరారయ్యేందుకు ప్రయత్నించిన నిందితుడిని స్థానిక గ్రామస్తులు వెంటాడి బొమ్మెర గ్రామ సమీపంలో పట్టుకుని పాలకుర్తి పోలీసులకు అప్పగించారు. అతడు మద్యం సేవించినట్లు పోలీసులు నిర్ధారించారు. పాలకుర్తి సీఐ జానకిరామ్ రెడ్డి నిందితుడిని అరెస్ట్ చేసి చట్టపరమైన చర్యలు పూర్తి చేసి న్యాయస్థానంలో హాజరుపరచగా, కోర్టు రిమాండ్ విధించింది.

# గవర్నర్ పర్యటనకు సర్వం సిద్ధం

- అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలి
- సీపీ ఎన్. శ్వేత, హనుమకొండ, వరంగల్ జిల్లా కలెక్టర్లు

**ప్రభాత గమనం, వరంగల్ క్రైమ్ బ్యూరో :**

రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్ల గురువారం హనుమకొండ, వరంగల్ జిల్లాల్లో నిర్వహించనున్న అధికారిక పర్యటన నేపథ్యంలో ఏర్పాట్లపై జిల్లా యంత్రాంగం విస్తృతంగా సమీక్ష నిర్వహించింది. వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత, హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి, వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్యశారద ఆధ్వర్యంలో హనుమకొండ సమీకృత జిల్లా కార్యాలయ సముదాయం (ఐడీఓసీ)లో జిల్లా ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశం జరిగింది. గవర్నర్ పర్యటన షెడ్యూల్‌ను శాఖలవారీగా పరిశీలించిన అధికారులు భద్రత, ప్రోటోకాల్, ట్రాఫిక్ నియంత్రణ, పారిశుద్ధ్యం, వైద్య సేవలు, విద్యుత్, తాగునీటి సరఫరా, పార్కింగ్, మీడియా సమన్వయం తదితర అంశాలపై అధికారులకు స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేశారు. ప్రతి శాఖ తన బాధ్యతలను సమయపాలనతో పూర్తి చేసి, ఎలాంటి లోపాలు లేకుండా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. గవర్నర్ ఉదయం నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ వరంగల్ చేరుకుని, అనంతరం హనుమకొండ ఐడీఓసీకి చేరుకొని 'నషా ముక్త్ భారత్' ర్యాలీకి జెండా ఊపి ప్రారంభిస్తారు. అనంతరం స్వయం సహాయక సంఘాల మహిళలు ఏర్పాటు చేసిన వివిధ ఉత్పత్తుల స్టాళ్లను సందర్శించి వారి ఉత్పత్తులను పరిశీలించడంతో పాటు మహిళలతో ముఖాముఖి నిర్వహించనున్నారు. తదుపరి హనుమకొండ, వరంగల్ జిల్లాల అధికారులతో అభివృద్ధి కార్యక్రమాలపై



సమీక్ష సమావేశం నిర్వహించి ప్రభుత్వ పథకాల అమలు, అభివృద్ధి పనుల పురోగతిని తెలుసుకోనున్నారు. అనంతరం హనుమకొండలోని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సేవలను పరిశీలించనున్నారు. ఆ తర్వాత పెద్దమ్మగడ్డలోని తెలంగాణ గిరిజన సంక్షేమ రెసిడెన్షియల్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (బాలికల కళాశాల)ను సందర్శించారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత, ఇరు జిల్లాల కలెక్టర్లు మాట్లాడుతూ గవర్నర్ పర్యటనలో ఎలాంటి లోటుపాట్లు తలెత్తకుండా అన్ని శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేయాలని సూచించారు. సమీక్ష సమావేశంలో జీడబ్ల్యూఎంసీ కమిషనర్ వెంకన్న, వరంగల్ డీసీపీ ధారా కవిత, అదనపు కలెక్టర్లు ఎన్. రవి, సంధ్యారాణి, జిల్లా రెవెన్యూ అధికారి శ్రీనివాస్‌తో పాటు పోలీసు, రెవెన్యూ, జీడబ్ల్యూఎంసీ, గిరిజన సంక్షేమ, వైద్యారోగ్య, రవాణా, ఆర్ అండ్ బీ, విద్యుత్, అగ్నిమాపక శాఖలకు చెందిన జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# హోంగార్డు మృతదేహానికి ఎస్పీ నివాళి

**ప్రభాత గమనం, వరంగల్ క్రైమ్ బ్యూరో :**



అనారోగ్య సమస్యలతో బాధపడుతూ మరణించిన హోం గార్డు శ్రీనివాస్ మృతదేహానికి జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. కుటుంబం ఎదుర్కొంటున్న ఈ క్లిష్ట సమయంలో పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. అదే విధంగా, మృతుడి కుటుంబానికి పోలీస్ శాఖ తరపున ఆర్థిక సహాయం అందజేశారు.

# రేపు స్కూళ్ల బంద్ కు పిలుపు

- వామపక్ష విద్యార్థి సంఘాల ఆందోళన
- యాజమాన్యాలు, తల్లిదండ్రులు సహకరించాలని విజ్ఞప్తి

**హైదరాబాద్, జులై 8(ప్రభాత గమనం):**

విద్యారంగంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ వామపక్ష విద్యార్థి సంఘాలు ఈ నెల 10వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా విద్యాసంస్థల బంద్‌కు పిలుపునిచ్చాయి. విద్యాసంస్థల యాజమాన్యాలు, విద్యార్థుల తల్లిదండ్రులు ఈ బంద్‌కు సహకరించాలని విద్యార్థి సంఘాల నాయకులు కోరారు. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో మౌలిక వసతుల మెరుగుదల, ఉపాధ్యాయుల ఖాళీల భర్తీ, విద్యార్థుల సమస్యల పరిష్కారం వంటి ప్రధాన డిమాండ్లతో ఈ బంద్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. హైదరాబాద్‌తో పాటు కొన్ని ప్రధాన నగరాల్లో ఈ బంద్ ప్రభావం ఎక్కువగా ఉండే అవకాశం ఉందని పేర్కొన్నారు.

# సుపారీ పేరుతో ప్రముఖ వైద్యుడికి బెదిరింపులు

- డబ్బుల కోసం కుట్ర పన్నిన ముగ్గురు నిందితుల అరెస్ట్
- మాజీ డ్రైవర్ తో పాటు మరో ఇద్దరిని అదుపులోకి తీసుకున్న హన్మకొండ పోలీసులు

**ప్రభాత గమనం, వరంగల్ క్రైమ్ బ్యూరో :**

ప్రముఖ వైద్యుడిని హత్య చేస్తామని, తనపై రూ.15 కోట్ల సుపారీ వచ్చిందంటూ బెదిరించి భారీగా డబ్బులు వసూలు చేయాలని కుట్ర పన్నిన ముగ్గురు నిందితులను హన్మకొండ పోలీసులు అరెస్ట్ చేశారు. సాంకేతిక ఆధారాలు, కాల్ డేటా విశ్లేషణ, నిఘా సమాచారంతో నిందితులను గుర్తించిన పోలీసులు ములుగు క్రాస్ రోడ్డు వద్ద వాహన తనిఖీల సందర్భంగా వారిని అదుపులోకి తీసుకున్నారు. పోలీసుల వివరాల ప్రకారం, హైదరాబాద్ దిల్‌సుఖ్‌నగర్‌కు చెందిన యమగోని సుభాష్ గౌడ్ (38) గతంలో హన్మకొండలోని రెనోవా ఆస్పత్రిలో బాధిత వైద్యుడి వద్ద డ్రైవర్‌గా పనిచేశాడు. ప్రవర్తన సరిగా లేకపోవడంతో ఉద్యోగం కోల్పోయిన అతడు, వైద్యుడిపై కక్ష పెంచుకుని డబ్బులు దోచుకునేందుకు కుట్ర పన్నాడు. ఈ కుట్రలో కరీంనగర్ జిల్లా సైదాపూర్ మండలానికి చెందిన శ్రీమూర్తి శ్రీనివాస్ (42), వరంగల్ జిల్లా నెక్కొండ మండలం అజ్మీర నాయక్ తండాకు చెందిన బానోత్ రమేష్ (40)లను భాగస్వాములుగా చేసుకున్నాడు. వైద్యుడి కుటుంబం, నివాసం, వాహనాలు, ప్రయాణ వివరాలు తెలిసిన సుభాష్, వైద్యుడి కదలికల సమాచారాన్ని శ్రీనివాస్ ద్వారా సేకరించి, రమేష్‌తో ఫోన్ చేయించి "మీపై రూ.15 కోట్ల సుపారీ వచ్చింది.. డబ్బులు ఇవ్వకపోతే చంపేస్తాం" అంటూ బెదిరింపులకు పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. బెదిరింపు కాల్స్ రావడంతో బాధిత వైద్యుడు వెంటనే పోలీసులను ఆశ్రయించగా, ప్రత్యేక దర్యాప్తు చేపట్టిన హన్మకొండ పోలీసులు నిందితుల కదలికలను గుర్తించారు. బుధవారం మరోసారి ఆస్పత్రి వద్ద రెక్కీ నిర్వహించేందుకు వచ్చిన నిందితులు ములుగు క్రాస్ రోడ్డు వద్ద పోలీసులను చూసి పరారయ్యేందుకు ప్రయత్నించగా వారిని అదుపులోకి తీసుకున్నారు. నిందితుల వద్ద నుంచి నేరానికి ఉపయోగించిన నాలుగు





మొబైల్ ఫోన్లతో పాటు బైక్ ను స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసును త్వరితగతిన ఛేదించిన ఎస్ఐ కె. కిషోర్, ఏవో సల్మాన్, హెడ్ కానిస్టేబుళ్లు రాహూఫ్, సోము నాయక్, కానిస్టేబుళ్లు రమణ, మహిపాల్, హెచ్‌జీ రవి, కుమారస్వామిలను సీఐ మచ్చ శివకుమార్ అభినందించారు.

# 'ఇందిరమ్మ' ఇల్లు స్థలంలో విద్యుత్ వైర్లు

- నిలిచిపోయిన ఇంటి నిర్మాణం
- గార్ల మండలం ములకనూరులో వెలుగుచూసిన వైనం
- 20 రోజులుగా ఏఈ చుట్టూ తిరిగినా స్పందన కరవు

గార్ల , జులై 8:( ప్రభాత గమనం)



ప్రభుత్వం నిరుపేదలకు సొంతింటి కలను నిజం చేయాలనే లక్ష్యంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ఇందిరమ్మ ఇల్లు' పథకం క్షేత్రస్థాయిలో అధికారుల ఉదాసీనత వల్ల నత్తనడకన సాగుతోంది. మహబూబాబాద్ జిల్లా గార్ల మండలం ములకనూరు గ్రామానికి చెందిన గొల్ల ప్రశాంతి (భర్త గొల్ల రాము) అనే లబ్ధిదారురాలికి ఇందిరమ్మ ఇల్లు మంజూరైనప్పటికీ, అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఇల్లు కట్టుకోలేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.బాధిత కుటుంబం తెలిపిన వివరాల ప్రకారం... మంజూరైన ఇందిరమ్మ ఇంటి నిర్మాణ స్థలం పైభాగంలో ప్రమాదకరంగా విద్యుత్ తీగలు వేలాడుతున్నాయి. ఆ తీగలను తొలగిస్తేనే ఇల్లు కట్టుకోవడానికి వీలవుతుంది. ఈ సమస్యను పరిష్కరించాలని కోరుతూ గత 20 రోజులుగా గార్ల విద్యుత్ శాఖ ఏఈ (AE) గారికి లబ్ధిదారులు నిరంతరం విన్నవిస్తూనే ఉన్నారు. అయినా సదరు అధికారి నుంచి ఎలాంటి స్పందన లేకపోవడం గమనార్హం.పైనున్న విద్యుత్ తీగలను తొలగించకపోవడంతో ఇందిరమ్మ ఇంటి నిర్మాణ పనులు పూర్తిగా నిలిచిపోయాయి. అధికారులు స్పందించి ఆ తీగలను తొలగిస్తే తప్ప పని ముందుకు సాగే పరిస్థితి లేదు. "ఇల్లు మంజూరైనా కట్టుకోలేని స్థితిలో ఉన్నాం, అధికారుల చుట్టూ తిరిగి అలసిపోయాం" అని లబ్ధిదారురాలు గొల్ల ప్రశాంతి ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి, తక్షణమే ములకనూరు గ్రామంలోని ఈ సమస్యను పరిశీలించి, విద్యుత్ తీగలను తొలగించి ఇంటి నిర్మాణానికి సహకరించాలని స్థానికులు, బాధిత కుటుంబం డిమాండ్ చేస్తోంది.



# ఓటు హక్కు పరిరక్షకు బీఆర్ఎస్ శ్రేణులు పనిచేయాలి

- మాజీ ఎమ్మెల్యే బానోత్ హరిప్రియ నాయక్

గార్ల, జూలై 08 (ప్రభాత గమనం) :

'ప్రతి అర్హుడికి ఓటు హక్కు-ప్రతి ఓటుకు రక్షణ' అనే లక్ష్యంతో బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు సైనికుల్లా పనిచేయాలని ఇల్లందు మాజీ శాసనసభ్యురాలు, నియోజకవర్గ పార్టీ ఇంచార్జ్ శ్రీమతి బానోత్ హరిప్రియ నాయక్ పిలుపునిచ్చారు. ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ (SIR) కార్యక్రమంలో బీఆర్ఎస్ శ్రేణులు చురుకుగా పాల్గొనాలని పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీ కేటీఆర్ ఇచ్చిన ఆదేశాల మేరకు.. గార్ల మండల పరిధిలోని 31 పోలింగ్ బూత్‌లకు నియమితులైన బూత్ లెవెల్ ఏజెంట్లతో ఆమె బుధవారం ఒక ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా హరిప్రియ నాయక్ గారు మాట్లాడు తూ.. ప్రతి బిఎల్ఓ నిర్వహించే 'SIR' ప్రక్రియలో బీఆర్ఎస్ ఏజెంట్లు అత్యంత చురుగ్గా భాగస్వాములు కావాలని సూచించారు. అర్హులైన ఓటర్ల పేర్లు జాబితాలో కొనసాగేలా చూడటంతో పాటు, కొత్త ఓటర్ల నమోదు, సవరణల ప్రక్రియ పారదర్శకంగా జరిగేలా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో పీఏసీఎస్ చైర్మన్ లక్కినేని సురేందర్, గార్ల మండల ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు మరియు నియమితులైన 31 మంది బూత్ లెవెల్ ఏజెంట్లు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# రోడ్డు విస్తరణ బాధితులకు ఇందిరమ్మ ఇళ్లు కేటాయించాలి

- వేం నరేందర్ రెడ్డికి బాధితుల వినతి

కేసముద్రం, జులై 8(ప్రభాత గమనం):

బుధవారం హైదరాబాద్ లో రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్ రెడ్డిని కేసముద్రం విలేజ్‌కు చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు చిల్లంచర్ల సతీష్ మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేశారు. కేసముద్రం మున్సిపాలిటీలో రూ.500 కోట్లతో మీ చొరవలో చేపడుతున్న అభివృద్ధి పనులకు గ్రామ ప్రజలు పూర్తి సహకారం అందించారని తెలిపారు. ఇందులో భాగంగా కేసముద్రం విలేజ్‌లో 80 అడుగుల వెడల్పుతో రహదారి నిర్మాణం చేపట్టగా, సుమారు 60 మంది ఇండ్లను పూర్తిగా కోల్పోయారని వివరించారు. బాధితుల్లో ఎక్కువ మంది రోజువారీ కూలీలు, పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన వారేనని, ఇళ్లు కోల్పోయి తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. అందువల్ల రోడ్డు విస్తరణ బాధితులకు ప్రత్యేకంగా ఇందిరమ్మ గృహ పథకం కింద ఇళ్లు మంజూరు చేసి ఆదుకోవాలని ఎంపీ వేం నరేందర్ రెడ్డిని కోరారు. ఆయన వెంట మహమ్మద్ జావిద్ ఉన్నారు.

# క్షణికావేశంలో ఆత్మహత్యాయత్నం

- యువకుడి ప్రాణాలు కాపాడిన పోలీసులు
- రైల్వే ట్రాక్ వద్ద గుర్తించి కుటుంబ సభ్యులకు అప్పగింత
- జీవితం అమూల్యం.. సమస్యలకు ఆత్మహత్య పరిష్కారం కాదు: మడికొండ సీఐ పుల్యాల కిషన్

వరంగల్ క్రైమ్ బ్యూరో, ప్రభాత గమనం:



క్షణికావేశంలో ఆత్మహత్యకు యత్నించిన ఓ యువకుడిని మడికొండ పోలీసులు సమయస్ఫూర్తితో స్పందించి సురక్షితంగా కాపాడారు. పోలీసుల అప్రమత్తతతో ఓ కుటుంబంలో తీవ్ర విషాదం తప్పింది. బుధవారం మడికొండ పోలీసులు వాహన తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో పల్లపు యాదగిరి, ఆయన కుటుంబ సభ్యులు పోలీసులను ఆశ్రయించారు. తమ కుమారుడు పల్లపు హర్షిత్ ఫోన్ చేసి రైల్వే ట్రాక్‌పైకి వెళ్లి ఆత్మహత్య చేసుకుంటానని చెప్పి కనిపించకుండా పోయాడని వారు ఆందోళన వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న మడికొండ పోలీస్ ఇన్‌స్పెక్టర్ పుల్యాల కిషన్ వెంటనే పోలీసు సిబ్బందిని రెండు బృందాలుగా విభజించి రైల్వే ట్రాక్ పరిసర ప్రాంతాల్లో గాలింపు చేపట్టారు. యువకుడి మొబైల్ ఫోన్ సిగ్నల్ ఆధారంగా అతడి ఆచూకీ గుర్తించి సురక్షితంగా రక్షించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. పోలీసుల విచారణలో, ఇంట్లో చదువుపై తండ్రి మందలించడంతో క్షణికావేశంలో ఆత్మహత్యకు ప్రయత్నించినట్లు హర్షిత్ తెలిపాడు. ఈ సందర్భంగా సీఐ పుల్యాల కిషన్ మాట్లాడుతూ, చిన్న చిన్న సమస్యలకు యువత ఆత్మహత్య వంటి తీవ్రమైన నిర్ణయాలు తీసుకోవద్దని, ప్రతి సమస్యకు పరిష్కారం ఉంటుందని అన్నారు. మానసిక ఒత్తిడి లేదా వ్యక్తిగత సమస్యలు ఎదురైనప్పుడు కుటుంబ సభ్యులు, స్నేహితులు లేదా పోలీసుల సహాయం తీసుకోవాలని సూచించారు. యువకుడి ప్రాణాలను సమయానికి కాపాడిన మడికొండ పోలీసుల సేవలను స్థానికులు, కుటుంబ సభ్యులు అభినందించారు. వారి వేగవంతమైన స్పందనతో ఒక కుటుంబంలో విషాదం తప్పిందని ప్రశంసించారు.



# మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు

గార్ల, జూలై 08 (ప్రభాత గమనం) :

మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల అమాయకుల ప్రాణాలు గాల్లో కలుస్తున్నాయని, పరిమితికి మించి మద్యం తాగి వాహనాలు నడిపితే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని గార్ల రూరల్ సీఐ రవీందర్ హెచ్చరించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు బుధవారం గార్ల మండల పరిధిలోని సత్యనారాయణపురం గ్రామంలో పోలీసులు విస్తృతంగా నాకాబంది (వాహన తనిఖీలు) కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ తనిఖీల్లో భాగంగా ద్విచక్ర వాహనాలు, కార్లు, ఇతర వాహనాలను నిలిపివేసి క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా సీఐ రవీందర్ మాట్లాడుతూ... రాత్రి వేళల్లో ప్రమాదాల నివారణకు, శాంతిభద్రతల పరిరక్షణకుగాను ఈ నాకాబంది తనిఖీలను చేపట్టినట్లు తెలిపారు. వాహనదారులు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, మైనర్లకు వాహనాలు ఇస్తే తల్లిదండ్రులపై సైతం కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో గార్ల ఎస్సై సాయికుమార్, పోలీస్ సిబ్బంది పాల్గొని వాహన తనిఖీలను పర్యవేక్షించారు.

# సీపీని కలిసిన ములుగు డీఎస్పీ

ప్రభాత గమనం, వరంగల్ క్రైమ్ బ్యూరో :

ఇటీవల వరంగల్ సీపీగా బాధ్యతలు స్వీకరించిన ఎన్. శ్వేతను ములుగు డీఎస్పీ రవీందర్ బుధవారం వరంగల్ పోలీస్ కమిషనర్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఇరువురు అధికారులు శాంతిభద్రతల పరిరక్షణ, నేర నియంత్రణ, ప్రజలకు మరింత సమర్థవంతమైన పోలీసింగ్ అందించే చర్యలు, శాఖాపరమైన అంశాలు, ఇరు జిల్లాల పోలీసు విభాగాల మధ్య సమన్వయంపై సుదీర్ఘంగా చర్చించారు. భవిష్యత్తులో పరస్పర సహకారం, సమన్వయంతో పని చేసి ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు.



# ఈవీఎం గోడౌన్ ను తనిఖీ చేసిన కలెక్టర్

ప్రభాత గమనం, వరంగల్ క్రైమ్ బ్యూరో :

నెలవారీ తనిఖీల్లో భాగంగా హనుమకొండలోని రెడ్‌క్రాస్ భవనం వెనుక ఉన్న ఈవీఎం గోడౌన్‌ను జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి బుధవారం ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా గోడౌన్‌లోని స్ట్రాంగ్‌రూమ్ సీళ్లను క్షుణ్ణంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్, ఈవీఎంల భద్రత విషయంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా అన్ని భద్రతా ప్రమాణాలను కచ్చితంగా అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. గోడౌన్ వద్ద విధులు నిర్వహిస్తున్న భద్రతా సిబ్బంది ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని, షిఫ్టుల వారీగా కేటాయించిన బాధ్యతలను సమయపాలనతో నిర్వర్తించాలని సూచించారు. గోడౌన్ పరిసరాల్లో భద్రతా ఏర్పాట్లు పటిష్ఠంగా ఉండేలా చర్యలు తీసుకోవడంతో పాటు, స్ట్రాంగ్‌రూమ్ రక్షణకు సంబంధించిన ప్రతి అంశాన్ని నిబంధనల మేరకు పర్యవేక్షించాలని స్పష్టం చేశారు. తనిఖీలో ఎన్నికల విభాగం పర్యవేక్షకులు జగత్ సింగ్, సంబంధిత అధికారులు, భద్రతా సిబ్బంది పాల్గొన్నారు.

# దుప్పి మాంసం కేసులో ఇద్దరికి ఏడాది జైలు శిక్ష

కొత్తగూడ, జూలై 8(ప్రభాత గమనం):

దుప్పి మాంసం కలిగి ఉన్న కేసులో ఇద్దరు నిందితులకు ఏడాది జైలు శిక్షతో పాటు జరిమానా విధిస్తూ కొత్తగూడెం మొదటి అదనపు జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కె. సాయిశ్రీ బుధవారం తీర్పు వెలువరించారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. 2021 జూలై 16 రాత్రి ములకలపల్లి మండలం చాపరాపల్లి శివారు చెరువు వద్ద ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ ఏ. మల్లికార్జున్ రావు తనిఖీలు నిర్వహిస్తుండగా దుప్పి మాంసంతో కొందరు వ్యక్తులు కనిపించారు. అధికారులను గమనించిన వెంటనే వారిలో పలువురు పరారయ్యారు. అనంతరం తన్నీరు లోకేష్, పసుపులేటి నాగేంద్రబాబులను అదుపులోకి తీసుకుని విచారించగా, మరికొందరి పేర్లు వెల్లడించారు. దీంతో అప్పటి ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ పి. రవికిరణ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. విచారణ సందర్భంగా ఐదుగురు సాక్షులను కోర్టు పరిశీలించింది. విచారణ అనంతరం రామచంద్రపురానికి చెందిన జబ్బారి నాగేశ్వరరావు,కంచు భూషయ్యలపై అభియోగాలు రుజువయ్యాయని కోర్టు నిర్ధారించింది. దీంతో ఇద్దరికీ ఒక్కో ఏడాది జైలు శిక్షతో పాటు రూ. 5 వేలు చొప్పున జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చింది. అయితే ఇదే కేసులో నిందితులుగా ఉన్న మిగతా ఏడుగురిపై అభియోగాలు రుజువు కాకపోవడంతో వారిని కోర్టు నిర్దోషులుగా ప్రకటిస్తూ కేసును కొట్టివేసింది. ఈ కేసులో ప్రభుత్వ తరఫున అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ (ఏపీపీ) అనిల్ కుమార్ వాదనలు వినిపించగా, ఫారెస్ట్ అధికారులు ముత్తయ్య, కల్పన దర్యాప్తు, విచారణలో సహకరించారు.

# రోడ్డు ప్రమాద ఘటన స్థలాన్ని పరిశీలించిన డీసీపీ

ప్రభాత గమనం, వరంగల్ క్రైమ్ బ్యూరో :



వరంగల్ పోలీస్ కమిషనరేట్ పశ్చిమ మండల డీసీపీ రాజా మహేంద్ర నాయక్, పాలకుర్తి మండలంలోని పాలకుర్తి, గూడూరు గ్రామాల వద్ద ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదాల ఘటన స్థలాలను సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ, మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల అమాయక ప్రజలు ప్రాణాలు కోల్పోవడం లేదా తీవ్ర గాయాలకు గురికావడం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి వాహనదారుడు ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని, మద్యం సేవించిన అనంతరం ఎట్టి పరిస్థితుల్లోనూ వాహనం నడపవద్దని సూచించారు. అలాగే అతివేగం, నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేయడం, హెల్మెట్ లేదా సీటుబెల్ట్ ధరించకపోవడం వంటి చర్యలు ప్రమాదాలకు ప్రధాన కారణాలని పేర్కొన్నారు. ప్రజలందరూ బాధ్యతాయుతంగా వ్యవహరించి రోడ్డు భద్రతకు సహకరించాలని కోరారు.



# ప్రారంభంకాని బుద్దారం హైలెవెల్ బ్రిడ్జి

- గుంతలమయంగా మారిన రోడ్డు.. నిత్యం ప్రమాదాలు
- 15 రోజుల్లో పూర్తి చేయకుంటే ధర్నా తప్పదు: సీపీఐ హెచ్చరిక

గార్ల, జూలై 08 (ప్రభాత గమనం) :

అధికారుల నిర్లక్ష్యానికి, ప్రజాప్రతినిధుల ఉదాసీనతకు గార్ల మండలంలోని బుద్దారం హై లెవెల్ బ్రిడ్జి నిర్మాణమే నిలువెత్తు సాక్ష్యంగా మారింది. బుద్దారం గ్రామపంచాయతీ, బుద్దారం తండా వద్ద మూడేళ్ల క్రితం ప్రారంభించిన హై లెవెల్ బ్రిడ్జి నిర్మాణం ప్రస్తుతం 99 శాతం పూర్తయింది. కేవలం ఒక శాతం అరకొర పనులను మిగిల్చి, వంతెనను ప్రజలకు అందుబాటులోకి తీసుకురాకుండా అధికారులు కాలయాపన చేస్తుండటంపై స్థానికంగా తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది.ఈ నేపథ్యంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు కట్టెబోయిన శ్రీనివాసరావు అధికారుల తీరును తీవ్రంగా ఖండించారు. గార్ల మండల సిపిఐ నాయకత్వంతో కలిసి ఆయన బుద్దారం వంతెన, శిథిలావస్థకు చేరిన రోడ్డును పరిశీలించారు.వంతెన ప్రారంభించకపోవడమే కాకుండా, బుద్దారం తండా హై లెవెల్ బ్రిడ్జి నుండి బుద్దారం గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారి దశాబ్దం క్రితం వేసింది కావడంతో పూర్తిగా అతుకుల బొంతగా మారింది. రోడ్డుపై భారీ గుంతలు ఏర్పడి వాహనదారులు నిత్యం నరకయాతన అనుభవిస్తున్నారు. ఇప్పటికే అనేక సందర్భాల్లో ద్విచక్ర వాహనాలు, ఆటోలు ఈ గుంతల్లో పడి బోల్తా కొట్టాయని, పలువురు తీవ్రంగా గాయపడ్డారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రజల ప్రాణాలతో ముడిపడి ఉన్న ఇంతటి తీవ్రమైన సమస్యపై సంబంధిత అధికారులు స్పందించకపోవడం ప్రజా వ్యతిరేక చర్యేనని సిపిఐ నాయకులు మండిపడ్డారు.99 శాతం పూర్తయిన బుద్దారం హై లెవెల్ బ్రిడ్జి మిగిలిన పనులను రాబోయే 15 రోజుల్లోగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలి.పూర్తిగా శిథిలమైన బుద్దారం గ్రామ రోడ్డును తక్షణమే కొత్తగా నిర్మించాలి.కొత్త రోడ్డు వేసే వరకు రాకపోకలకు ఇబ్బంది లేకుండా గుంతలను పూడ్చి తాత్కాలిక మరమ్మతులు చేపట్టాలి."ప్రజల సమస్యలను అధికారులు వెంటనే పరిష్కరించకుంటే, సిపిఐ ఆధ్వర్యంలో బుద్దారం బ్రిడ్జి వద్ద పెద్ద ఎత్తున 'రాస్తారోకో', 'ధర్నా' కార్యక్రమాలు చేపడతాం. ప్రజా ఉద్యమం ద్వారానే అధికారుల నిద్ర మత్తు వదిలిస్తాం."ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి జంపాల వెంకన్న, భూక్య హరినాయక్, ధరావత్ వీరన్న, అన్నం శ్రీనివాసరావు, జి. భీముడు మరియు బుద్దారం గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ నిరసనను వ్యక్తం చేశారు.

# వైఎస్సార్ పథకాలు రైతాంగానికి కొండంత అండ

- మహబూబాబాద్ ఎంపీ బలరాం నాయక్
- కేసముద్రం మార్కెట్ యార్డ్ లో ఘనంగా జయంతి వేడుకలు
- చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన ఎంపీ, కాంగ్రెస్ శ్రేణులు

కేసముద్రం, జూలై 08 (ప్రభాత గమనం):



దేశంలోనే ఎన్నడూ లేని విధంగా అనేక విప్లవాత్మక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి, పేద ప్రజల గుండెల్లో నిలిచిన ఘనత దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వై.ఎస్. రాజశేఖర్ రెడ్డిదేనని మహబూబాబాద్ పార్లమెంట్ సభ్యులు (ఎంపీ) పోరిక బలరాం నాయక్ కొనియాడారు. బుధవారం మహబూబాబాద్ నియోజకవర్గం కేసముద్రం మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్సార్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. మార్కెట్ కమిటీ చైర్మన్ గంట సంజీవ్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ఎంపీ బలరాం నాయక్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీ బలరాం నాయక్ మాట్లాడుతూ.. వైఎస్ రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలో ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు రైతాంగానికి కొండంత అండగా నిలిచాయన్నారు. ఉచిత విద్యుత్ నిర్ణయం, రైతుల రుణమాఫీ వంటి చారిత్రాత్మక నిర్ణయాలు కుదేలైన వ్యవసాయ రంగాన్ని ఎలా నిలబెట్టాయో ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. జయంతి వేడుకల కార్యక్రమంలో పీసీసీ సభ్యులు దసురు నాయక్, డీసీసీ అధికార ప్రతినిధి అంబటి మహేందర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బానోత్ వెంకన్న, ఆర్టీఏ మెంబర్ రావుల మురళి, ఇనుగుర్తి మండల అధ్యక్షులు కూరెల్లి సతీష్, మాజీ జెడ్పీటీసీ కదిరి సురేందర్ పాల్గొన్నారు.వీరితో పాటు సారంపల్లి మోహన్ రెడ్డి, వేముల శ్రీనివాస్ రెడ్డి, రాంబాబు, శ్రీరామ్ కిరణ్, చిలువేరు సమ్మయ్య గౌడ్, బానోత్ బధ్య, మాజీ ఎంపీటీసీ బాలు, పోలేపల్లి వెంకట్ రెడ్డి, రషీద్ ఖాన్, వివిధ గ్రామాల పార్టీ అధ్యక్షులు, స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# చిన్నారుల భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత

- షీ టీం ఎస్ఐ ఫజల్ ఖాన్

ప్రభాత గమనం, వరంగల్ క్రైమ్ బ్యూరో :



భూపాలపల్లి జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు జిల్లా షీ టీం ఎస్సై ఫజల్ ఖాన్ ఆధ్వర్యంలో, సిబ్బందితో కలిసి భూపాలపల్లి జిల్లాలోని మహాత్మా జ్యోతిబా పూలే తెలంగాణ వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల పాఠశాల మరియు జూనియర్ కళాశాల (బాలికలు)లో విద్యార్థినులకు ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు గుడ్ టచ్-బ్యాడ్ టచ్, మహిళల భద్రత, స్ట్రీట్ హరాస్మెంట్, సోషల్ మీడియా వినియోగంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సైబర్ నేరాల నివారణ, వ్యక్తిగత భద్రత వంటి అంశాలపై సమగ్రంగా అవగాహన కల్పించారు. అపరిచిత వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్, వీడియో కాల్స్‌ను స్వీకరించరాదని, సోషల్ మీడియా ద్వారా వ్యక్తిగత సమాచారం, ఫోటోలు, ఓటీపీలు లేదా ఇతర గోప్యమైన వివరాలను ఎవరికీ పంచుకోవద్దని సూచించారు. విద్యార్థినులు చెడు అలవాట్లకు దూరంగా ఉండి విద్యపై పూర్తి దృష్టి సారించి, జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ప్రోత్సహించారు. పాఠశాల పరిసరాల్లో అనుమానాస్పద వ్యక్తులు సంచరిస్తున్నట్లు గమనించినా, మహిళలు లేదా బాలికల పట్ల ఎవరైనా అసభ్యంగా లేదా అనుచితంగా ప్రవర్తించినా వెంటనే షీ టీంను సంప్రదించాలని సూచించారు. షీ టీం మొబైల్ నంబర్ 8712658162కు ఫిర్యాదు చేయవచ్చని, ఫిర్యాదుదారుల వివరాలను పూర్తిగా గోప్యంగా ఉంచి నిందితులపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో డయల్-100కు కాల్ చేయాలని, సైబర్ మోసాలకు గురైన వెంటనే 1930 సైబర్ హెల్ప్‌లైన్‌కు ఫిర్యాదు చేసి ఆర్థిక నష్టాన్ని నివారించుకోవాలని వివరించారు. ఈ కార్యక్రమంలో షీ టీం ఎస్సై ఫజల్ ఖాన్, షీ టీం సిబ్బంది, పాఠశాల అధ్యాపకులు మరియు విద్యార్థినులు పాల్గొన్నారు.

Printed, Published and Owned by PANDULA RAVICHANDER at .H NO 1-67/16/B/R NTR NAGAR COLONY KESAMUDRAM VILLEGE, MAHABUBABD, TELANGANA, 506101, Editor. P. Ravichander. email:www.prabhatagamanam.com * RNI NO.TELTEL/2022/83842* CELL : 7780470374